క్లుప్తంగా

ఉచిత పశువైద్య శిబిరం

చిన్నశంకరంపేట(మెదక్): సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని టీ.మాందాపూర్ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పశువులకు సూడి, గర్భకోశ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతామాలిక మాట్లాడుతూ పశుపోషకులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భిక్షపతి గౌడ్, ఎంపీటీసీ ప్రసాద్ గౌడ్, గోపాల మిత్ర సూపర్ వైజర్, వీఏ విజయకుమార్, రాజు, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకలను ప్రారంభిస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో ఐబీసీ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ రుబేన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ విష్ణువర్ధన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలారం బాబు, మాజీ టెలికం బోర్డు మెంబర్ అంచనూర్ రాజేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆకుల మల్లేశం గౌడ్, భూపతి రాజు హాజరై క్రిస్మస్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ప్రతీ ఒక్కరు ఏసుక్రీస్తు మార్గంలో నడవాలన్నారు.

వాహనం ఢీ.. వ్యక్తి మృతి

అల్లాదుర్గం(మెదక్): వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధి 161 జాతీయ రహదారి ముస్లాపూర్ శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. గురువారం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన వేణుగోపాల్‌గౌడ్ కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్తున్నాడు. ముస్లాపూర్ శివారులో వేణుగోపాల్ గౌడ్ తండ్రి శ్రీరాములుగౌడ్ మూత్ర విసర్జన చేసేందుకు కారు దిగి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో బన్సువాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న టీఎస్ 16యూఏ 3562 తుఫాన్ వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని అంబులెన్సులో చికిత్స కోసం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు వేణుగోపాల్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిల్లల చదువుపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యామ్‌రావు

అల్లాదుర్గం(మెదక్): ఇంటర్ వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్నాయని, పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అల్లాదుర్గం జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్యామ్‌రావు అన్నారు. గురువారం తల్లిదండ్రులు, అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక స్టడీమెటీరియల్ రూపొందించామన్నారు. ప్రతీరోజు సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు చక్కగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

రేగోడ్(మెదక్): మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు ఎంపీపీ సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీతారావమ్మ గురువారం తెలిపారు. సమావేశానికి సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

అర్హులకు ఓటుహక్కు కల్పించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాలలో 18 ఏళ్లు నిండినవారు ఓటుహక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. గురువారం కౌడిపల్లిలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి అర్హులైన వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయాలని, సవరణలు చేయాలని, డబుల్ ఎంట్రీలు, మృతుల ఓటును తొలగించాలని చెప్పారు.

నేడు సర్వసభ్య సమావేశం

కౌల్దారం(నర్సాపూర్): మండల సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గణేష్ రెడ్డి గురువారం తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

అసంపూర్తిగా అభివృద్ధి పనులు

- కలెక్టర్ హెచ్చరించినా ఫలితం శూన్యం
- ఆరోగ్య కేంద్రంలోని గుంతలు తీసి వదిలేసిన వైనం
- ముస్లిం శ్మశాన వాటిక పనుల్లో జాప్యం
- పనులు పూర్తిచేయాలని స్థానికుల డిమాండ్



అల్లాదుర్గం ఆరోగ్య కేంద్రంలో ప్రహరీ కోసం తవ్విన గుంత



నిలిచిన అల్లాదుర్గం ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ

అల్లాదుర్గం(మెదక్): అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రారంభించిన ముస్లిం శ్మశానవాటిక పనులు, ఎన్నికల తర్వాత నిలిచిపోయాయి. అభివృద్ధి పనుల్లో భాగంగా ఆరోగ్య కేంద్రంలో తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను కలెక్టర్ హెచ్చరించినా ప్రయోజనం లేకుండా పోయింది. కేంద్రానికి వెళ్లాలంటే స్థానికులు జంకుతున్నారు. అల్లాదుర్గంలో ముస్లిం శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణం కోసం ఎస్‌డీఎఫ్ కింద రూ.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంట్రాక్టర్ పనులు చేపట్టాడు. అందోల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఓడిపోవడంతో ప్రహరీ నిర్మాణం నిలిపివేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అలాగే అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్లు, మూత్రశాలలు, శ్లాబ్ ఫ్లోరింగ్ తదితర పనుల కోసం ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసింది. ఈ పనుల్లో నాణ్యత పాటించలేదని ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. శ్లాబు వేసినా వర్షం కురిస్తే కురుస్తోందని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. జూలై 25న కలెక్టర్ రాజర్షిషా ఆరోగ్యం కేంద్రం సందర్శించి పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సక్రమంగా పనులు చేయకుంటే కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అప్పటి బీఆర్ఎస్ అధికార పార్టీ అండదండలతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపట్టినట్లు ఆరోపణలున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మల్లికార్జున స్వామి

రేపటి నుంచి మల్లన్న ఉత్సవాలు

- ఐదు రోజులపాటు నిర్వహణ
- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- భారీగా తరలిరానున్న భక్తులు

టేక్మాల్(మెదక్): కొండల నడుమ కొలువైన మల్లికార్జున స్వామి ఉత్సవాలు ఐదురోజులపాటు జరగనున్నాయి. ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివస్తారు. ఉత్సవాల నిర్వహణ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. టేక్మాల్ మండలం కాద్లూర్‌లో ఏటా మల్లన్న ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. సర్పంచ్, గ్రామపెద్దల సమక్షంలో ముందస్తు సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై చర్చిస్తారు. కులమతాలకతీతంగా చందాలు వేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఐదురోజుల పాటు జరిగే ప్రతీ ఉత్సవంలో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతుంది.

రేపటి నుంచి ఉత్సవాలు

ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు శ్రీ మల్లికార్జున స్వామి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సర్పంచ్ పోచ యాదయ్య గురువారం తెలిపారు. 23న బోనాలు సమర్పిన, 24న బండ్ల శకటోత్సవం , 25న కుస్తీ పోటీలు, అన్నదాన కార్యక్రమం, 26న రథోత్సవం, 27న పాచి బండ్ల ఊరేగింపు జరుగుతాయన్నారు. కుస్తీ పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతితోపాటు ఐదు తులాల వెండి కడియాన్ని బహూకరిస్తామన్నారు. ఉత్సవాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరుకానున్నట్లు తెలిపారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

శ్రీ మల్లికార్జున స్వామి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం. ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. కుస్తీ పోటీలు, బండ్ల ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ సహకరించాలి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించాం.

– పోచ యాదయ్య, సర్పంచ్, కాద్లూర్

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం.. ఆయిల్ చోరీ



ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని నర్సంపల్లి, వల్లూరు గ్రామాలలో రెండు రోజులుగా దొంగలు రెచ్చిపోతున్నారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నర్సంపల్లిలోని రెండు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లు, వల్లూరు గ్రామంలోని 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి ఆయిల్‌ను దొంగిలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసంతో భారీ నష్టం వాటిల్లిందని ట్రాన్స్‌కో ఏఈ స్వామి తెలిపారు. చోరీ విషయంపై నార్సింగి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు. మండల ప్రజలు వ్యవసాయ బోర్ బావుల వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌లపై నిఘా పెట్టాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



చిట్కుల్‌లో ఏఈ రాంబాబుకు దరఖాస్తు ఇస్తున్న గ్రామస్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏఈ రాంబాబు అన్నారు. మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో గురువారం విద్యుత్ సమస్యలు, వినియోగదారుల సేవలు తదితర అంశాలపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని గ్రామ స్తులు దరఖాస్తులు అందజేశారు. ఉన్నత పాఠశాల పైనుంచి వేసిన 11 కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించి, గ్రామ శివారులో వేయాలని సర్పంచ్ గోపాల్‌రెడ్డి కోరారు. అనంతరం ఏఈ రాంబాబు విద్యుత్ చౌర్యం, కొత్త మీటర్లు, బిల్లుల చెల్లింపుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సబ్ ఇంజినీర్ సల్మాన్, ఉప సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు అధికారుల దృష్టికి తేవాలి

మనోహరాబాద్(తూప్రాన్): విద్యుత్ సమస్యలు తమ దృష్టికి తేవాలని కాళ్ళకల్ విద్యుత్ ఏఈ కృష్ణ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మండలంలోని కాళ్ళకల్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యుత్ సమస్యలు అధికారుల దృష్టికి తేవాలని లేకుంటే, తూప్రాన్ ఏడీఏ కార్యాలయంలోని వినియోగదారుల కేంద్రంలో ఫిర్యాదు చేయొచ్చన్నారు. అంతకు ముందు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ విద్యుత్ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రతీ ఇంటికి అయోధ్య అక్షింతల పంపిణీ



వెల్దుర్తిలో అక్షింతల కలశం ఊరేగింపు



కుర్తివాడలో..

వెల్దుర్తి(తూప్రాన్): అయోధ్య నుంచి అక్షింతల కలశం శ్రీరామ జన్మభూమి ట్రస్టు ద్వారా గురువారం వెల్దుర్తికి చేరుకుంది. కలశానికి భక్తులు పూజలు చేసి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ యూత్ సభ్యులు మాట్లాడారు. ఎంతో పవిత్రమైన అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను జనవరి 1 నుంచి మండలంలోని ప్రతీ ఇంటికి అందజేస్తామన్నారు.

పాపన్నపేట(మెదక్): మండలంలో అయోధ్య రామ మందిర అక్షింతల పంపిణీ కార్యక్రమం గురువారం కుర్తివాడ హనుమాన్ దేవాలయంలో నిర్వహించారు. జనవరి 1 నుంచి 15 వరకు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



కౌడిపల్లిలో డ్రోన్ గురించి వివరిస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని ఆయా శాఖల అధికారులు అన్నారు. గురువారం మండల పరిధిలోని గన్యాతండాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఈజీఎస్, పీఎం కిసాన్ యోజన, పీఎం సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల గ్యాస్ పథకం, ముద్ర రుణాలు తదితర పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, పంచాయతీ కార్యదర్శి నిర్మల, హెల్త్ సెక్రటరీ సృజన, ఏఈఓ రమ్య, వెటర్నరీ అసిస్టెంట్ సురేష్, ఈసీ భగవాన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కౌడిపల్లి(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల నోడల్ అధికారి, ఎస్‌బీఐ మేనేజర్ లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. గురువారం కౌడిపల్లి, కొట్టాల గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కొట్టాల సర్పంచ్ నరహరి, వివిధ శాఖల అధికారులు పుణ్యదాస్, సంగమేశ్వర్, శశికళ, లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు మల్లేశం, వెంకటేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్సులు ఆపడంలేదని మహిళల ఆగ్రహం



చిల్వెర ఐబీ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సుకు అడ్డంగా నిలబడిన మహిళలు

అల్లాదుర్గం(మెదక్): ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మహిళలకు ఇబ్బందిగా మారింది. స్టేజీల వద్ద కొందరు డ్రైవర్లు బస్సులు ఆపడం లేదు. అధికారుల ఆదేశాల మేరకే ఆపడంలేదనే విమర్శలున్నాయి. బస్సులు ఆపడంలేదని డిపో మేనేజర్‌కు ఫోన్ చేస్తే, బస్సు నిండటంతో ఆపడం లేదని సమాధానం ఇవ్వడం గమనార్హం. మండలంలోని చిల్వెర ఐబీ చౌరస్తాలో రేగోడ్, రాయికోడ్, వట్‌పల్లి, అల్లాదుర్గం ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఇక్కడే ఎక్కుతారు. ఐబీ చౌరస్తాలో గురువారం ఉదయం 10 గంటల సమయంలో బస్సులు ఆగకుండా వెళ్లాయి. దీంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుకు అడ్డంగా నిలుచున్నారు. కొద్దిసేపటికి సంగారెడ్డి డిపోకు చెందిన ఏపీ23 జెడ్ 0072 బస్సు వచ్చింది. దానిని అడ్డుకొని బస్సులు ఎందుకు ఆపడం లేదని డ్రైవర్‌ను ప్రయాణికులు నిలదీశారు. ప్రయాణికుల ప్రశ్నలకు డ్రైవర్ సమాధానం ఇవ్వలేదు. ఈ విషయంపై నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఫోన్ చేసినా సరైన సమాధానం చెప్పలేదని స్థానికులు తెలిపారు. ఎక్కువ మంది మహిళలు ఉంటే బస్సును ఆపొద్దని అధికారులు మౌఖిక ఆదేశాలు ఇస్తున్నట్లు విమర్శలున్నాయి.

ఆలయానికి విరాళం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొత్తచెరువుతండాలో శ్రీజగదాంబదేవి, సేవాలాల్ మహారాజ్ ఆలయంలో మైక్‌సెట్ ఏర్పాటుకు సర్పంచ్ పద్మదూద్యనాయక్ రూ.10 వేల విరాళం అందజేశారు. గూగ్లోత్ తండాలో నిర్మించిన ఆలయం వద్ద మైక్‌సెట్ ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. సర్పంచ్‌ను తండావాసులు అభినందించారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): గర్భిణులకు ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తోంది. గురువారం సీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆయా గ్రామాలకు చెందిన గర్భిణులకు నెయ్యి, టానిక్స్, బెల్లంపట్టీలు, ఇతర పోషకాహార పదార్థాలున్న కిట్లను పంపిణీ చేసినట్లు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపై దృష్టిసారించిందన్నారు.

కడీలు తొలగింపుపై చర్యలు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ భూమిలో పాతిన కడీలను తొలగించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. మండల పరిధి గుండ్లపల్లి శివారులోని సర్వే నంబరు 19లో 13 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. మండలంలో పనిచేస్తున్న 13 మంది విలేకరులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆ స్థలంలో కడీలు ఏర్పాటు చేయగా దొంతి గ్రామానికి చెందిన చెన్నుగారి మంగమ్మ, సత్తయ్య దంపతులు బుధవారం రాత్రి తొలగించినట్లు చెప్పారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంత్రిని కలిసిన ఆలయ చైర్మన్

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ కలిశారు. గురువారం హైదరాబాదులోని మంత్రి నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాన్ని సందర్శించాలని కోరినట్లు చెప్పారు.

ఆలయ వార్షికోత్సవం

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల తండాలో గురువారం జగదాంబమాత సేవాలాల్ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హోమం, పంచామృతంలో అభిషేకం, అఖండ దీపారాధన, గణపతి పూజ, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు చేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలని ఆటోడ్రైవర్ల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆటో డ్రైవర్లు

చిన్నశంకరంపేట(మెదక్): ఉచిత ప్రయాణ పథకం అమలుతో తాము ఉపాధి కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలంటూ ఎన్ఆర్‌సీ ఆటోయూనియన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు యూనియన్ నాయకులు గురువారం తహసీల్దార్ కరీంకు వినతి పత్రం అందజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ప్రయాణ పథకంతో తాము ఉపాధి కోల్పోయామన్నారు. ఫైనాన్స్‌లో ఆటోలుకొని నడుపుకుంటూ ఉపాధి పొందుతున్నామని, ప్రస్తుతం వాయిదాలు కట్టలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బోరు మోటార్ల కేబుల్ చోరీ



నిజాంపేటలో బోరు మోటారు వైర్లను ఎత్తుకెళ్లిన దృశ్యం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో గుర్తుతెలియని దుండగులు 20 వ్యవసాయ బోరు మోటార్ కేబుల్ వైర్లను చోరీ చేశారు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. బాధిత రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం పొలం పనులు ముగించుకొని ఇళ్ల వెళ్లామని, గురువారం ఉదయం వచ్చి చూడగా స్టార్టర్ బోర్డుకున్న మోటారు వైర్లు కట్ చేసి ఉన్నాయన్నారు. వైర్లను తగులబెట్టి కాపర్ ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. చోరీ చేసినవారిని పోలీసులు పట్టుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మెదక్ కలెక్టరేట్: బీఆర్ఎస్ నాయకులు విచక్షణ కోల్పోయి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ నేతలు సురేందర్ గౌడ్, జీవన్ రావు, బొజ్జ పవన్ మండిపడ్డారు. ఫారెస్ట్ అధికారులు సాప సాయిలు అరెస్టుకు నిరసనగా ఎమ్మెల్యేపై టీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు చేశారు. గురువారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. 2020 సెప్టెంబర్ 17న అడవిలో కబ్జాపై ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేశారన్నారు. గత ప్రభుత్వంలో నమోదుచేసిన కేసులో అరెస్ట్ చేస్తే ఆ పార్టీ నేతలు విక్షణ కోల్పోయి ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. విధుల్లో ఉన్న బీట్ అధికారిపై సాయిలు దాడి చేయడంతో కేసు నమోదైన విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో నిరాధార ఆరోపణలు చేసే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్, నాగరాజు, గాజిరెడ్డిపల్లి, బొల్లారం రైతులు పాల్గొన్నారు.

సర్పంచ్‌గా మళ్లీ యాదయ్య

సస్పెన్షన్ ఎత్తివేత

టేక్మాల్(మెదక్): ఆరు నెలలపాటు సస్పెన్షన్‌లో ఉన్న మండలంలోని కాద్లూర్ సర్పంచ్ పోచ యాదయ్య తిరిగి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ రియాజొద్దీన్ గురువారం తెలిపారు. పోచ యాదయ్య సస్పెన్షన్‌లోఉన్న ఆరునెలలు జ్యోతి బన్సిలాల్‌ను సర్పంచ్‌గా కొనసాగిన విషయం విదితమే. సర్పంచ్‌గా యాదయ్య, ఉప సర్పంచ్‌గా జ్యోతి బన్సిలాల్ కొనసాగుతారని ఎంపీడీఓ తెలిపారు. దశాబ్ది వేడుకలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో యాదయ్యను సస్పెండ్ చేశారు.

బస్సు సర్వీసునకు వినతి

శివ్వంపేట(నర్సాపూర్): రద్దుచేసిన బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ పాంబండ గ్రామస్తులు గురువారం ఎమ్మెల్యే సునీతారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని పోతులబోగూడ, పాంబండ, ఉసిరికపల్లి, చండి, గోమారం, లచ్చిరెడ్డిగూడం, నవాబుపేట గ్రామాల మీదుగా బాలానగర్ నుంచి వెల్దుర్తి వరకు గతంలో నడిచిన ఆర్టీసీ బస్సు సర్వీసు రద్దు చేయడంతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. దీంతో స్పందించి ఎమ్మెల్యే బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులను సునీతారెడ్డి ఫోన్‌లో ఆదేశించినట్లు బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేష్ తెలిపారు.